క్లుప్తంగా

రైల్వే ఆస్పత్రిలో అత్యాధునిక రిఫ్రిజిరేటర్ల ప్రారంభం


ఆధునిక రిఫ్రిజిరేటర్లను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో బుధవారం మూడు అడ్వాన్స్‌డ్ ఐస్‌లైన్ రిఫ్రిజిరేటర్లను డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా ప్రారంభించారు. అత్యంత ఖరీదైన, ప్రాణాలను కాపాడే ఇంజక్షన్లు నిల్వ చేసేందుకు ఈ రిఫ్రిజిరేటర్లు ఉపయోగపడతాయని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. వీటి ద్వారా రోగులకు అత్యున్నతమైన వైద్యం, ఉన్నత ప్రమాణాలు గల మందులు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ బాబు, ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, రైల్వే ఆస్పత్రి వైద్యులు, వాల్తేర్ డివిజన్ బ్రాంచి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా బాలసతీష్


బాలసతీష్‌ను అభినందిస్తున్న ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: నగరంలోని వాల్తేర్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ వైస్ ప్రెసిడెంట్ సి.బాలసతీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన వాల్తేర్ క్లబ్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సమీప ప్రత్యర్థి బి.లక్ష్మణ్ పాత్రోపై బాలసతీష్ 400 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కార్యక్రమంలో ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ జి.వి.రెడ్డి, కార్యదర్శి బి.వి.ఎస్.సుబ్బరాజు, ఉపాధ్యక్షులు ఎస్.రాజశేఖర్, డి.సూరిబాబు, ఎం.వి.రమణ, పి.నారాయణరావు, జాయింట్ సెక్రటరీలు అనంతరాజు, జి.శంకర్‌రెడ్డి, బి.వేణుగోపాలరావు, కోశాధికారి డి.ఇ.వి.రామప్రసాదరెడ్డి, కౌన్సెల్ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ సరఫరా ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయి సునీల్ కిషోర్

అల్లిపురం: నవజాత శిశువులకు ఆక్సిజన్ అందించడం ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చని ప్రముఖ నవజాత శిశు వైద్య నిపుణుడు డాక్టర్ సాయి సునీల్ కిషోర్ తెలిపారు. మహారాణిపేట మెడికవర్‌లో మాతా శిశు ఆస్పత్రి సముదాయంలో డబ్ల్యుహెచ్‌వో మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి నిర్వహించిన శిశువుల ప్రాణాలను రక్షించే నైపుణ్యతను పెంపొందించే నీయబ్రీత్ నియోనాటాల్ రిసిపిటేషన్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది నవజాత శిశువులు మొదటి నిమిషంలోనే ప్రాణాంతక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. ఇదే శిశు మరణాలకు ప్రధాన కారణాలలో ఒకటన్నారు. ఈ సమయంలో శిశువును కాపాడటానికి వెంటిలేషన్ ఎయిర్ మేనేజ్‌మెంట్ సిమ్యులేషన్ పరికరాల ద్వారా ఆక్సిజన్ అందించడంలో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు కర్ణాటక వ్యక్తి

అల్లిపురం: తల్లి మృతి చెందడంతో మానసిక స్థితి బాగులేక రోడ్లు పట్టి తిరిగిన కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా, సముద్ర గ్రామానికి చెందిన ఆంజనేయ అనే వ్యక్తిని ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు కుటుంబానికి అప్పగించారు. నాలుగేళ్ల క్రితం అతను రాయచూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినప్పటికీ మానసిక వ్యాధి నయం కాలేదు. దాంతో అతను ఊరు వదిలి విశాఖ చేరుకున్నాడు. 2024లో ఏయూటీడీ రెస్క్యూ చేసి ఆశ్రయం కల్పించింది. శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా మందులు వాడటంతో ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో అతని వివరాలు తెలుసుకున్న శ్రద్ధ ఫౌండేషన్ సిబ్బంది కర్ణాటలో సముద్ర గ్రామానికి తీసుకెళ్లి అతని సోదరుడు మానేష్‌కు అప్పగించారు.

సంతకు పోదాం రండి

- మాధవధారలో ప్రతి గురువారం నిర్వహణ • తక్కువ ధరకే వస్తువుల లభ్యం
- అందరికీ అందుబాటులో పలు రకాల వస్తువులు, కూరగాయలు
- వినియోగదారులతో సందడే సందడి


అగర్‌బత్తీలు, బొమ్మలు అమ్ముతున్న చిరు వ్యాపారులు


మాధవధార వారపు సంతలో విక్రయిస్తున్న పండ్లు, పువ్వులు


చెప్పులు, మొబైల్ గ్లాస్‌లు, దుస్తుల విక్రయం

మద్రిపాలెం: సంత అంటే అందరికీ సరదాగా ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ చౌకగా ఇంటికి కావాల్సిన ప్రతి వస్తువు లభిస్తుంది. చక్కటి టైమ్ పాస్ కూడా. ఈ క్రమంలో 51వ వార్డు మాధవధార 48 లాస్ట్ బస్టాప్ వుడా కాలనీ మొదలుకుని అర కిలోమీటర్ మేర రోడ్డుకు ఇరువైపులా అనేక షాపులు ఏర్పాటు చేసుకుని విక్రయదారులు సంత నిర్వహిస్తారు. ఈ సంత ప్రతి గురువారం సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది. ఇక్కడ అతి తక్కువ ధర రూ.5 మొదలుకుని రూ.500 పైవరకు ఇంటికి కావాల్సిన అన్ని వస్తువులు లభ్యమవుతాయి. మహిళలు ఎక్కువగా ఇక్కడికి వచ్చి ఇంటికి కావాల్సిన అన్ని సామాన్లు కొనుగోలు చేస్తారు. ఒక్క మహిళలే కాదు, వృద్ధులు, పురుషులు, పిల్లలు, ఇటు ఆర్ అండ్ బీ నుండి అటు మురళీనగర్, మద్రిపాలెం వరకు ఉన్న ప్రజలు వందలాది సంఖ్యలో ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు.


ప్లాస్టిక్ సామగ్రి కొంటున్న వినియోగదారులు


కూరగాయలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సంతలో లభించేవి..

ఈ సంతలో కూరగాయలు, ప్లాస్టిక్ వస్తువులు, చీపుర్లు, ఇనుప వస్తువులు, మూకుడులు, కత్తిపీటలు, డైనింగ్ టేబుల్ కవర్లు, ఆడవారికి, పిల్లలకి కావాల్సిన దుస్తులు, క్లిప్పులు, రబ్బర్ బ్యాండ్లు, ఆట వస్తువులు, చెప్పులు, దుప్పట్లు, ,హ్యాండ్ బ్యాగ్‌లు, వంట సామగ్రి, పువ్వులు, పండ్లు, కుండలు, మట్టి పాత్రలు, తినేందుకు పానీపూరీ, చాట్, లైట్లు, పూజకు కావాల్సిన సామగ్రి ఇలా ఒకటేంటి అన్నీ దొరుకుతాయి. అందుకే గురువారం వచ్చిందంటే చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సంతకు రావడానికి ఆసక్తి చూపుతారు. ఇక్కడ పేద, ధనిక అన్న భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు వచ్చి కావాల్సినవి కొనుగోలు చేస్తారు. అంధులు ఇక్కడ పాటలు పాడుతుంటారు. వారి ఆట, పాటలను తిలకించి నగదు బహూకరిస్తారు.

అన్ని వస్తువులు ఒకే చోట..

సాధారణంగా పల్లెల్లో సంతలు చూస్తుంటాం. ఇంటికి కావాల్సిన ప్రతి వస్తువు, కావాల్సిన నిత్యావసరాలు అన్నీ ఒకే చోట లభ్యమవుతాయి. తక్కువ ధరకే సంతలో ఒకే చోట విక్రయించడమే సంత ఉద్దేశం. ఇలా పట్నాల్లో సంతలు జరగడం ఆశ్చర్యం కలిగిస్తుంది. 51వ వార్డు మాధవధారలో సంత నిర్వహించడం బాగుందని స్థానికులు చెబుతున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి విక్రయదారులు తమ సరుకును విక్రయించి లాభాలతో వెళతారు. అయితే కొన్ని సార్లు వర్షాలు పడడంతో పెద్దగా వినియోగదాలు రాకపోవడంతో వ్యాపారులు నష్టపోతుంటారు కూడా.

అలరించిన కవి సమ్మేళనం


కవిత చదివి వినిపిస్తున్న రచయిత కుప్పిలి భీమేశ్వరరావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అందరినీ అలరించింది. ముఖ్య అతిథి రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవులకు అధ్యయనం, భాషా పరిజ్ఞానం, భావ పరిపుష్టి ఉండాలని సూచించారు. విశిష్ట అతిథి డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ కవులకు పలు సూచనలు చేశారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వానికి నిజాయితీతో కూడిన ఆలోచన, ఉద్వేగాలు ముడిసరకుగా ఉండాలన్నారు. అది కవిత్వం కావడానికి రచనా కళ, భావ సౌందర్యం, నేర్పరితనం అవసరమన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కుప్పిలి భీమేశ్వరరావు, సిహెచ్.చినసూర్యనారాయణ, కె.రాంప్రసాద్, కొత్తూరు రమణ, అయ్యల సోమయాజుల ప్రసాద్, కె.విశ్వేశ్వరరావు, పీవీఆర్ కుమారరావు, ఆర్.శివాజీ తదితరులు తమ స్వీయ కవితలు చదివి వినిపించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు నిధులు విడుదల చేయాలి

మురళీనగర్: రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల పేదలకు బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాలకు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సమాఖ్య విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రవికుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2024–25 బడ్జెట్‌లో బీసీలకు వ్యక్తిగత, వ్యాపారాల నిర్వహణకు సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. వీరికి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను బ్యాంకులకు పంపారని చెప్పారు. ఈ మేరకు జిల్లాలో 400 యూనిట్లకు 900 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో కలెక్టర్, బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ ఈ వివరాలను ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ నిధులను నేటి వరకు ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. ఎంపికైన దరఖాస్తుదారులు బ్యాంకులు, బీసీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ నిరుత్సాహంతో వెనుదిరగాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వం తక్షణం నిధులు మంజూరు చేయాలని కోరారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు

- భక్తులు నడిచే రహదారుల్లో పిచ్చి మొక్కల తొలగింపు
- శుభ్రత పనుల్లో పారిశుధ్య సిబ్బంది


నరసింహనగర్‌లో రహదారి పక్కన పిచ్చి మొక్కలను తొలగించిన దృశ్యం


పోర్ట్ క్వార్టర్స్ ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది


దీప్ భవన్ ప్రాంతంలో పొక్లెయిన్‌తో తొలగిస్తున్న పిచ్చి మొక్కలు

తాటిచెట్లపాలెం: ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 9న సింహాచలంలో గిరి ప్రదక్షిణ ప్రారంభమై.. అడవివరం, ముడసర్లోవ, చినగదిలి, హనుమంతవాక జంక్షన్, వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ, గణేష్ నగర్, నరసింహనగర్, కైలాసపురం, మాధవధార, ఎన్‌ఏడీ, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణ సాగుతుంది. కోస్తాంధ్రతోపాటు ఒడిశా, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు సింహాచలం క్షేత్రం చుట్టూ చేసే గిరి ప్రదక్షిణ కోసం జీవీఎంసీ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకంగా కొండవాలు ప్రాంతాలైన హెచ్‌బీ కాలనీ, నరసింహనగర్, గణేష్‌నగర్, పోర్ట్ క్వార్టర్స్, సాలగ్రామపురం, మాధవధార వుడా కాలనీ ప్రాంతాల్లో రహదారులను సరిచేసి, అవసరమైన ఏర్పాట్లు చేయాలి. దీనిలో భాగంగా జీవీఎంసీ సిబ్బంది నరసింహనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాట్లు ప్రారంభించారు. పొక్లెయిన్ సహాయంతో రోడ్లపైకి పెరిగిన, రోడ్లను మూసేసిన పిచ్చి మొక్కలను తొలగించడం, రహదారులను విశాలంగా చేయడం వంటి పనులు చేస్తున్నారు. రోడ్లకిరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించి పాదచారులకు అనుకూలంగా మార్చుతున్నారు. కొన్ని చోట్ల జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలు శుభ్రం చేస్తుండగా.. మరికొన్ని చోట్ల పొక్లెయిన్‌లతో పను లు చేపడుతున్నారు. త్వరలోనే అవసరమైన చోట్ల రోడ్లకు మరమ్మతులు చేయడం, పాదచారులు, భక్తులకు వసతుల కల్పన కోసం పరిశీలించడం వంటి పనులు చేస్తామని జీవీఎంసీ సిబ్బంది తెలిపారు.

సింహాచల గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు అవసరమైన తాగునీరు, టాయిలెట్లు, లైటింగ్, విశ్రాంతి కోసం టెంట్లు, మెడిసిన్ సదుపాయాలతోపాటు ఆయా స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రసాదం, ఫలహారాలు అందజేయనున్నారు. వీటి కోసం త్వరలోనే ప్రాంతాలను ఎంపిక చేసి వాటిని ఏర్పాటు చేయనున్నారు. అన్ని వార్డుల పరిధిలో ఇప్పటి నుంచే ఒకసారి రోడ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి అవసరమైతే రెండో సారి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని జీవీఎంసీ సిబ్బంది తెలిపారు.

ముసురు వాన


గురుద్వారా బస్ బే వద్ద నిలిచిన వర్షపు నీరు


రామాటాకీస్ రోడ్‌లో కురుస్తున్న వర్షం


చిత్తడిగా మారిన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్


అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో తెరుచుకోని చిరు వ్యాపారాలు


కూలి పని కోసం వర్షంలో ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సీతంపేట: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి నగరం తడిసి ముద్దయింది. బుధవారం తెల్లవారుజాము నుంచి రోజంతా వర్షం కొనసాగడంతో జన జీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది. కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాలల విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పక్కన వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. బేరాలు లేక కొన్ని చోట్ల వ్యాపారాలు తెరుచుకోలేదు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, 80 అడుగుల రోడ్‌లో జరుగుతున్న అమృత్ 2.0 పనుల కోసం తవ్విన గోతుల వద్ద మట్టి వర్షం కారణంగా చిత్తడిగా మారింది. రోడ్డుపై బురదతో వాహనాలు జారిపడే ప్రమాదం ఉందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా కూలి పనులు దొరక్క సీతంపేట, అక్కయ్యపాలెం కూడళ్లలో కూలిపని వారు గంటల తరబడి నిరీక్షించారు. పని దొరక్క నిరాశగా ఇంటి ముఖం పట్టారు.

వైభవంగా వారాహి నవరాత్రులు


లలితా పీఠంలో వారాహి అమ్మవారికి నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకుడు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం పండితుల వేదమంత్రాల నడుమ సహస్రనామార్చన, కుంకుమార్చన, చతుర్వేద స్వస్తి జరిపారు. అనంతరం విశేష హారతులిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని ఆరాధిస్తూ పూజల్లో పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

బీచ్‌రోడ్డు: తొలగించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి వెంటనే తీసుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహార దీక్ష 1554వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికు లు జీతాలు పెంచాలనో, రెగ్యులర్ చేయాలనో సమ్మె చేయడం లేదని, ప్రభుత్వమే పథకం ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించడం వల్ల వారు ఈరోజు సమ్మెలో ఉన్నారని తెలిపారు. ఇది జీవన్మరణ పోరాటం అన్నారు. ఈ పోరాటాని కి ఐద్వా సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఇప్పటికే మూడు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో ఎక్కువ మంది నిర్వాసితులు ఉన్నారన్నారు. అలాగే భూములిచ్చి త్యాగం చేశా రని గుర్తు చేశారు. రెండవ దఫా ఎసెట్ మానిటైజేషన్ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఎక్కడెక్కడి ప్రభుత్వ ఆస్తులను అమ్మేయడం, డబ్బులు చేసుకోవడమే మానిటైజేషన్ అన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారని, అయితే స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం మాట్లాడినట్టు వార్తలు రాలేదన్నారు. అంటే స్టీల్‌ప్లాంట్‌ను వదిలించుకునే కుట్రలో భాగస్వాము లు అయినట్టు భావించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. విమల, బి. ఈశ్వరమ్మ, బి. భారతి, కె. కుమారి, జి. లక్ష్మి, డి. కొండమ్మ, వి. ప్రభావతి, కె. సంతోషం, మమత, నిర్మల, హైమావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహా వారాహిగా వారాహి మాత

అల్లిపురం: సాయి శ్రీమేరు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లిపురంలోని షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన అనఘా లక్ష్మీదేవి ఆలయంలో కొలువై ఉన్న వారాహి అమ్మవారు బుధవారం మహా వారాహి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని దానిమ్మ గింజలతో విశేషంగా అలంకరించారు. వారాహి హోమం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యార్థులకు బొద్దింకల భోజనం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచా మల్లేశ్వరి

మహారాణిపేట: తమ ప్రభుత్వంలో జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేస్తే.. కూటమి పాలనలో విద్యార్థులకు బొద్దింక గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచా మల్లేశ్వరి విమర్శించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్లు పద్మారెడ్డి, శశికళ, పార్టీ నాయకురాలు బయ్యవరపు రాధతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పాఠశాలలు ప్రారంభించి నేటికి నాలుగు వారాలైనా వారికి సరైన మౌలిక వసతులు కూడా కల్పించలేదని ఎద్దేవా చేశారు. పాయకరావుపేటలోని బీసీ ఉమెన్స్ హాస్టల్‌లో రాష్ట్ర హోం మంత్రి అనిత తిన్న భోజనంలో బొద్దింక ఉంటే.. అది తీసి చూపించిన ఆమె ఇప్పుడు తలవెంట్రుక మాత్రమే ఉందని మాట మార్చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు లోకేష్ శాఖ కావడంతో ప్రజలను మభ్య పెట్టేందుకు హోం మంత్రి తీవ్రంగా శ్రమించారన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చిందని, ఎక్కడైనా తప్పు జరిగితే తక్షణమే స్పందించి వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని పేర్కొన్నారు. హోం మంత్రి మీడియా ముందుకు వచ్చినంత మాత్రాన నిజం అబద్ధమైపోదని మండిపడ్డారు. వసతి గృహాల్లో మంచి భోజనం పెట్టి, నాణ్యమైన విద్యను అందించే దిశగా పాలన సాగిస్తే మంచిదని, లేదంటే విద్యార్థుల తల్లిదండ్రులే కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు బుద్ధి చెప్పే పరిస్థితులు వస్తాయని మల్లేశ్వరి హెచ్చరించారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

అల్లిపురం: బ్రిటీష్ కాలం నుంచి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్చి కేంద్ర బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెచ్చింది. దీనివల్ల కార్మికుల ప్రాథమిక హక్కులైన సంఘం ఏర్పాటు, సమ్మె చేయడంతో సహా అనేక హక్కులు కోల్పోతారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. బుధవారం జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజుకు 8 గంటల బదులు 12 పని గంటలు చేయాలని లేబర్ కోడ్‌లు చెబుతున్నాయని తెలిపారు. కార్మికవర్గం సమ్మె చేస్తే ఒకరోజు సమ్మెకు 8 రోజుల జీతం కట్ అవుతుందన్నారు. బీఎంఎస్ లేబర్ కోడ్‌లను సమర్థిస్తూ జూలై 9 నాటి కార్మిక సమ్మెను వ్యతిరేకించడం కార్మికవర్గానికి ద్రోహం చేయడమే అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను బీఎంఎస్ సమర్థించడం సిగ్గుచేటన్నారు.

51వ వార్డులో వీధిలైట్ల పరిశీలన


వీధిలైట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, జీవీఎంసీ అధికారులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో బుధవారం రాత్రి కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లోని వీధి లైట్లను పరిశీలించారు. ఇటీవల పలు ఏరియాల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడం, కాంతి చాలకపోవడం, కొత్త దీపాలు వేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. కొన్ని వీధుల్లో 20 వాట్స్‌కు బదులుగా 40 వాట్స్ లైట్లు ఏర్పాటు చేశారు. వీటిని జీవీఎంసీ ఎలక్ట్రికల్ ఏఈ అర్చన, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, జీవన్‌లతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు.